
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 6 జూలై 2024



మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకం

'ఎత్తిపోతలకు' నిధులు

- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రూ.78.85 లక్షలు
- మంత్రి అచ్చెన్న చొరవతో మంజూరు.. రైతుల హర్షం

(టెక్కలి)

ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మంత్రి అచ్చెన్న చొరవతో నిధులు మంజూరు కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట మండలాల పరిధిలో వంశధార ప్రధాన ఎడమకాలువపై సుమారు పదివేల ఎకరాలకు సాగునీరు అందించే ఎనిమిది ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటిలో గత ఆరు నెలలుగా సుమారు రూ.80లక్షలు విలువచేసే రాగివైరు, డీపీ ఆయిల్ చోరీకి గురయ్యాయి. దీనిపై ఏపీఎస్ఐడీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఖరీఫ్‌లో తమకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్న- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం రూ.78.85 లక్షల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

- చిన్నసాన ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రూ.14.60 లక్షలు, సొడాం ఎత్తిపోతల పథకానికి రూ.13.80లక్షలు, మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి రూ.31.20లక్షలు, సుభద్రాపురం ఎత్తిపోతల పథకానికి రూ.4.40లక్షలు, తొగిరి ఎత్తిపోతల పథకానికి రూ.8.35 లక్షలు, టెక్కలిపాడు ఎత్తిపోతల పథకానికి రూ.6.50 లక్షలు నిధులను మంజూరయ్యాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఏపీఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. నిధుల మంజూరుపై రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్లలో ఒక్కక్కటీ చోరీ జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు. తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన అచ్చెన్నకు రుణపడి ఉంటామని పలువురు రైతులు తెలిపారు.

ఉపాధి నిధులు ఊదేశారు!



రాయిపిండి కొట్టుకుపోయిన అడ్డివాడ రహదారి

- గిరిజన గ్రామాల రహదారుల పనుల్లో అవకతవకలు
- ఓట్ల లెక్కింపు ముందురోజు రూ.1.68 కోట్ల బిల్లులు అప్‌లోడ్
- పీసీల రూపంలో రూ.20 లక్షల ఆఫర్
- సూత్రధారి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారే

(మెళియాపుట్టి)

'మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది. ప్రస్తుతం బిల్లులు చెల్లిస్తే మీకు జిల్లాస్థాయిలో మంచి పోస్టింగ్ ఇస్తాం. అలాగే రూ.కోటికి పీసీల రూపంలో రూ.20లక్షలు అందజేస్తామ'ని మెళియాపుట్టి మండలంలో కొండలపై ఉన్న గ్రామాలకు రోడ్లు పనులు చేసిన ఒక వైసీపీ కాంట్రాక్టర్ అధికారులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీంతో ఓట్ల లెక్కింపునకు ముందు రోజు.. అంటే గత నెల 3న అర్ధరాత్రి ఉపాధి కార్యాలయం తలుపులు వేసి.. బిల్లులు అప్‌లోడ్ చేసినట్టు తెలుస్తోంది. ఈ అక్రమాల వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం 'రోడ్డు వేయకుండానే బిల్లులు' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో బిల్లులకు సహకరించిన అధికారుల్లో అలజడి రేగుతోంది. అక్రమాల డొంక కదులుతోంది. మారుమూల గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించడంతో వాటిని పనులు చేయకుండానే బిల్లులు చేయించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మెళియాపుట్టి మండలంలో కొండపై ఉన్న కేరాశింగి, గూడ, అడ్డివాడ, చంద్రగిరి గ్రామాలకు రహదారుల కోసం నిధులు మంజూరయ్యాయి. కొంతమేర మట్టి పనులు చేపట్టి.. రాయి పిండి వేసి వదిలేశారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే అడ్డివాడలో రోడ్డుపై రాయిపిండి మొత్తం కొట్టుకుపోయింది. మరింత అధ్వానంగా మారింది. వైసీపీకి చెందిన కాంట్రాక్టర్ పనులు చేయకుండానే పలుకుబడితో బిల్లులు చేయించుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఆర్‌డీలో ఒక కీలక అధికారి ద్వారా.. జిల్లా ఉపాధిహామీలో పనిచేస్తున్న అధికారులకు పీసీల ఆశ చూపి ఒకేరాత్రి రూ.1.66 కోట్ల మేర బిల్లులు చేయించుకున్నట్టు తెలిసింది.

చందనగిరి రహదారి పనులకు సంబంధించి రూ.25,20,393 బిల్లులు చెల్లించారు. గూడ రహదారికి సంబంధించి రూ.43,84,659 బిల్లులు, కేరాశింగి రోడ్డుకు రూ.63,12,859 మేర బిల్లులు చెల్లించారు. అలాగే కొండపై మరో రెండు గ్రామాలకు రూ.17,16,376, రూ.17,48,108 చొప్పున రెండు బిల్లులు చేయించుకున్నట్టు తెలుస్తోంది.

మండల అధికారిపై ఒత్తిడి..

రహదారుల బిల్లులకు సంబంధించి ఎంపీడీవో లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారి బిల్లులు చెల్లించేందుకు ఒప్పుకోకపోవడంతో.. అమరావతిలో ఉన్న కీలక వైసీపీ నేతతో భయపెట్టి మరీ లాగిన్‌లో బిల్లులు చేయించుకున్నట్టు తెలుస్తోంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారితో పాటు ఐటీడీఏ ఇంజనీర్ ఒకరు దగ్గరు ఉండి రాత్రంతా బిల్లులు అప్‌లోడ్ చేసి ఓట్ల లెక్కింపు రోజే నిధులు జమయ్యేలా ఏర్పాటు చేశారు. ఈ వ్యవహారంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారే సూత్రధారిగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవినీతికి సహకరించిన అధికారుల్లో అలజడి రేగుతోంది. రోజూ టీడీపీ నేతల ప్రసన్నం కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా బిల్లుల మతలబుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడతాయని గిరిజన సంఘం నేతలు పేర్కొంటున్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సిక్కోలును అభివృద్ధి చేస్తా

- వ్యవసాయ రంగానికి తొలి ప్రాధాన్యం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 5: అందరికీ అందుబాటులో ఉంటూ, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో అధికశాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయ రంగాన్ని తొలి ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా మీడియా ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. 'నాది మహారాష్ట్ర. ఇంజనీరింగ్ చదివి 2016 ఐఏఎస్ బ్యాచ్ అధికారిగా తొలుత గుంటూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశాను. తర్వాత నూజివీడు సబ్ కలెక్టర్‌గా, కాకినాడ, విజయవాడ కార్పొరేషన్ల కమిషనర్‌గా పనిచేశా. వ్యవసాయం, విద్య, వైద్యం వంటి అంశాలపై పక్కా ప్రణాళిక రూపొందించుకుని ఫలితాలు సాధిస్తాం. జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాం. జిల్లాలో ఎటువంటి సమస్యలున్నా నేరుగా నన్ను సంప్రదించవచ్చ'ని కలెక్టర్ తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

'అధికారులంతా అంకిత భావంతో పనిచేయాలి. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలి' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ నవీన్‌తో కలిసి.. అధికారులతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు సాధించగలమని స్పష్టం చేశారు. అలాగే నూతన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అలాగే పింఛన్ల పంపిణీపై డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీవోలు సీహెచ్.రంగయ్య, భరత్‌నాయక్, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, డీపీవో వేంకటేశ్వర్లు, ఐసీడీఎస్, డీఆర్డీఏ, డ్వామా పీడీలు శాంతిశ్రీ, కిరణ్‌కుమార్, చిట్టిరాజు, ఏపీసీ జయప్రకాష్, మైన్స్ డీడీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో మీనాక్షి, సీపీవో ప్రసన్నలక్ష్మి, వ్యవసాయాధికారి శ్రీధర్, ఎల్డీఎం సూర్యకిరణ్, ఏఈ రాజు పాల్గొన్నారు.

నెత్తురోడుతున్నాయ్

- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- గుర్తించని యాక్సిడెంట్ జోన్లు



వీఆర్వో మౌనిక (ఫైల్)

(శ్రీకాకుళం క్రైం)

జిల్లాలో రోడ్లు నెత్తురోడుతున్నాయి. రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలతోపాటు మరణాల సంఖ్య కూడా పెరిగిపోతోంది. వాహనదారులకు అప్రమత్తం అవసరం. హెల్మెట్లు, సీటు బెల్టు ధరించడం అత్యంత ప్రధానం. కాగా.. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. 2021లో జిల్లావ్యాప్తంగా 732 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నారు. 2022లో 832 ప్రమాదాలు, 2023లో 791 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. సుమారు 200 మందికిపైగా మరణించారు. ఇలా రోజుకి సగటున రెండు, మూడు రోడ్డు ప్రమాదాలు జరగడం కలవరపాటుకు గురి చేస్తోంది.

- శ్రీకాకుళంలో కొన్ని ప్రాంతాలు డెత్ జోన్‌లుగా మారాయి. నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డు మలుపు, 80 అడుగుల రోడ్డు, మిల్లు జంక్షన్, అరసవల్లి తోట జంక్షన్, డేఅండ్ నైట్, సూర్యమహల్ కూడళ్ల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో గతేడాది నలుగురు, ఈ ఏడాది ఇద్దరు మరణించారు. ఎంతోమంది క్షతగాత్రులుగా మిగిలారు. శ్రీకాకుళం నగరంలోనే గతేడాది 70 రోడ్డు ప్రమాదాలు సంభవించగా.. ఏడుగురు మృతి చెందారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 30 ప్రమాదాలు జరగ్గా.. నలుగురు మరణించారు. మృతుల్లో అధికశాతం 15 నుంచి 25 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం.
- నగరంలో 2016 నుంచి 2024 వరకు ట్రాఫిక్ డీఎస్పీలు, సీఐలు మారుతున్నారే తప్ప.. యాక్సిడెంట్ జోన్‌లను మాత్రం గుర్తించడం లేదు. 2016లో తొలిసారి ఎస్పీ ఏఎస్‌ఖాన్ హయాంలో నగరంలో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు మునిసిపల్ అధికారులతో కలిసి ప్రమాద మలుపులు, పార్కింగ్ స్థలాలు గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. తర్వాత ఇప్పటివరకూ యాక్సిడెంట్ జోన్‌లను గుర్తించలేదు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంలో పోలీసు శాఖ వైఫల్యం చెందిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎస్పీ రాధిక, ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.



పెద్దకొజ్జిరియా జంక్షన్ వద్ద కంటైనర్ కిందకి దూసుకుపోయిన బైక్ (ఫైల్)

ఎన్నో ప్రమాదాలు..

- కంచిలి మండలం పెద్దకొజ్జిరియా జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం చత్రపురానికి చెందిన దిలీప్ పొరిడా (24)మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. దిలీప్ పొరిడా కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతడితోపాటు అదే గ్రామానికి చెందిన హరిహర పరిడాతో కలిసి బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో పెద్దకొజ్జిరీయ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను బలంగా ఢీకొట్టగా దిలీప్ పొరిడా అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న హరిహర పరిడా గాయపడ్డాడు. ఇతడిని చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
- జూన్ 29న అర్ధరాత్రి స్థానిక మిల్లు జంక్షన్ వద్ద శ్యామ్‌పాలెనికి చెందిన గస్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం మీద వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఓ ఆర్టీసి ఉద్యోగి విధులు ముగించుకుని అక్కడకు వచ్చారు. క్షతగాత్రుడి బంధువులకు సమాచారం ఇచ్చి స్థానికుల సహాయంతో రిమ్స్‌కు తరలించడంతో ప్రమాదం తప్పింది.
- ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళంలోని మహిళా కళాశాల రోడ్డులో ఓ వృద్ధుడ్ని ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీ కొట్టారు. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు.
- ఎచ్చెర్ల మండలానికి చెందిన మౌనిక(23) శ్రీకాకుళంలోని సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహించేది. గతేడాది నవంబరులో సచివాలయం నుంచి ఎమ్మార్వో కార్యాలయానికి సమావేశం నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సరిగ్గా ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం సమీపంలో.. మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఆమె కోమాలోకి వెళ్ళిపోయింది. ఆమెను జెమ్స్‌లో చేర్పించగా బ్రెయిన్ డెడ్ కావడంతో తల్లిదండ్రుల అంగీకారంతో ఆమె అవయవాలను దానం చేశారు.
- గతేడాది ఖాజీపేటకు చెందిన 19ఏళ్ల యువకుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా స్థానిక అరసవిల్లి తోట జంక్షన్‌లో ట్రాక్టర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా ఎన్నో సంఘటనల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి.



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

అదృశ్యం కేసుల దర్యాప్తు వేగవంతం

- ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైం, జూలై 5: జిల్లాలో అదృశ్య (మిస్సింగ్) కేసులపై ప్రత్యేక దృష్టి సారించి.. దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్ఐలతో సమావేశమయ్యారు. జిల్లావ్యాప్తంగా అదృశ్య కేసులు దర్యాప్తు, విచారణ, కేసు ఫైల్ స్టేజ్ తదితర అంశాలపై సమీక్షించారు. ముందుగా అదృశ్య కేసుల ఫైల్స్ పరిశీలించారు. కేసుల దర్యాప్తులో పురోగతిపై ఆరా తీశారు. అదృశ్యమైన వ్యక్తులను పట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించాలని సూచించారు. సాంకేతిక ఆధారాల ద్వారా కూడా వ్యక్తుల సమాచారం తెలుసుకుని.. కేసులు పరిష్కరించాలని తెలిపారు. యుక్త వయసులో తప్పిపోయిన బాలికలు, మహిళల కేసులపై దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఈ కేసులను చేధించి.. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు బాధిత మహిళలను అప్పగించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ డా.జి.ప్రేమ్‌కాజల్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- నేడు పలాసకు వంశధార
- వైసీపీ పాలనలో చుక్కనీరు కూడారాని వైనం

(పలాస)

పలాస నియోజకవర్గానికి ఎట్టకేలకు వంశధార రానుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో చుక్కనీరు కూడా రాక.. రైతులు సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. వంశధారను పలాస నియోజకవర్గానికీ అందించేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఉదయం వంశధార చేరుకుంటుందని అధికారులు ప్రకటించారు. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద మూడు రోజుల కిందట వంశధార నీటిని కాలువ ద్వారా విడుదల చేశారు. బ్యారేజి నుంచి నీరు ఇక్కడకు చేరడానికి నాలుగు రోజుల వ్యవధి పడుతుంది. టెక్కలిపట్నం, నందిగాం మీదుగా పలాసకు నీరు చేరుకుంటుంది. అక్కడ నుంచి కేదారిపురం 60టి వద్దకు చేరుకొని వివిధ దశల్లో వజ్రపుకొత్తూరు మండలంలోకి ప్రవేశించి శివారు భూములకు నీరందిస్తుంది. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో మొత్తం వంశధార కాలువ ద్వారా 9వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. అనధికారికంగా మరో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.



వంశధార కాలువ పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే శిరీష(ఫైల్)

- టీడీపీ హయాంలో 2019 వరకూ వంశధార నీరు పలాసకు వచ్చేది. మాజీ మంత్రి, అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందరశివాజీ నిత్యం అధికారులతో చర్చించి నీటిని తీసుకువచ్చేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి కాగా.. టెక్కలి నియోజకవర్గం వరకే వంశధార పరిమితమైంది. దీనిపై ఆ పార్టీ నాయకులే జిల్లా సమావేశాల్లో అధికారుల తీరును ప్రశ్నించినా పట్టించుకున్న పాపాన లేదు. ఫలితంగా కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. వర్షం నీరు కూడా ప్రవహించే పరిస్థితి లేదు.
- ఈసారి ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా గౌతు శిరీష భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆమె వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఈక్రమంలో ఇటీవల పలాస మండలం టెక్కలిపట్నం వద్ద వంశధార ప్రవేశించే ప్రాంతాన్ని మంత్రి అచ్చెన్న సందర్శించారు. వైసీపీ నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా వంశధార నీరు రాక.. రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే శిరీష ఆయనకు వివరించారు. దీంతో పలాసకు వంశధార వచ్చేలా చర్యలు చేపడతామని అచ్చెన్న హామీ ఇచ్చారు. ఈ మేరకు పలాస నియోజకవర్గంలో వంశధార కాలువ ప్రవహించే మొత్తం 16 కిలోమీటర్ల కాలువను ఆధునీకరించారు. కాలువలో పిచ్చిమొక్కలు తొలగించారు. చుక్క నీరు వచ్చినా నేరుగా వంశధార ఆయకట్టు చెరువుల్లోకి చేరేలా వంశధార అధికారులు పనులు పూర్తి చేశారు. దీంతో సాగునీటి ఇబ్బందులు తప్పనున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గంగమ్మను స్వాగతిద్దాం



టెక్కలిపట్నం వద్ద వంశధార నీరు శనివారం చేరుకుంటుంది. గంగమ్మతల్లికి స్వాగతం, హారతులు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున రైతులు, టీడీపీ నాయకులు తరలిరావాలి. సాగునీటి వనరులన్నీ పక్కాగా బాగుచేసి రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- పీరుకట్ల విఠల్‌రావు,
టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అరసవల్లి, జూలై 5: మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు శ్రీకాకుళం బీసీ స్టడీసర్కిల్ సంచాలకులు ఇ.అనూరాధ తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10లోగా శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. 12నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వెనుక గిరిజన భవన్‌లో శిక్షణ ప్రారంభిస్తాం. 75శాతం హాజరు కలిగిన అభ్యర్థులకు స్టయిఫండ్‌గా రూ.1500, బుక్స్ అలవెన్సు కింద రూ.1000 అందజేస్తాం. అభ్యర్థులు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, కుల, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువపత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకురావాలి. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489, 8332852106 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల'ని అనూరాధ సూచించారు.

తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీజీ ఈఏపీ సెట్ 2024 (ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్' ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా బీఈ/బీటెక్/ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు టీజీ ఈఏపీ సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియను మూడు విడతల్లో నిర్వహిస్తారు. చివరలో స్పాట్ అడ్మిషన్స్ ఉంటాయి.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ టీజీ ఈఏపీ సెట్ 2024(ఎంపీసీ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 16 ఏళ్లు; ఫార్మాడీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సుకు 17 ఏళ్లు నిండి ఉండాలి. స్కాలర్‌షిప్ పొందాలంటే 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.

స్లాట్ బుకింగ్: వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'పేమెంట్ ఆఫ్ ప్రాసెసింగ్ ఫీ' లింక్‌పై క్లిక్ చేయాలి. టీజీ ఈఏపీసెట్ 2024 హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. తరవాత ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర సమాచారం ఎంటర్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద జనరల్, బీసీ అభ్యర్థులు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చెల్లించాలి. తరవాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం దగ్గరలోని హెల్ప్ లైన్ సెంటర్, డేట్, టైమ్ సెలెక్ట్ చేసుకోవాలి. దివ్యాంగులు, ఎన్‌సీసీ అభ్యర్థులు, క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులు, ఆంగ్లో ఇండియన్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు మాత్రం హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్ వద్దగల గవర్నమెంట్ పాలిటెక్నిక్ సెంటర్‌ను ఎంచుకోవాలి. ఈ కేటగిరీలకు నిర్దేశించిన తేదీల ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులకు జూలై 6 నుంచి 8 వరకు; ఎన్‌సీసీ అభ్యర్థులకు జూలై 9 నుంచి 12 వరకు; దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులకు జూలై 13న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్: హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లే అభ్యర్థులు తమ వెంట టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; ఆధార్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మెమో-పాస్ సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ; 2024 జనవరి 1న గానీ ఆ తరవాత గానీ తీసిన ఇన్‌కం సర్టిఫికెట్; వ్యాలిడ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్; కులం, స్థానికత, వైకల్యం, ఎన్‌సీసీ, క్రీడలు తదితర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి.

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తరవాత అధికారులు ఇచ్చిన ఆర్‌ఓసీని చెక్ చేసుకోవాలి. తరవాత అభ్యర్థుల మొబైల్‌కు లాగిన్ ఐడీ పంపుతారు. ఈ ఐడీ వచ్చిన తరవాతనే హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి బయటకు రావాలి. దీని ద్వారా అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు.

ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 నుంచి 23 వరకు

సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 26
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 27
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 27 నుంచి 28 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 28
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 9 నుంచి 10 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** ఆగస్టు 10
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 13
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 13 నుంచి 15 వరకు

సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లయిడింగ్ షెడ్యూల్

- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **ఫ్రీజింగ్ ఆప్షన్స్:** ఆగస్టు 22
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 26
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 27 నుంచి 28 వరకు
- **స్పాట్ అడ్మిషన్స్‌గైడ్‌లైన్స్ విడుదల:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0fXXywPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సుల్లో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదో తరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

సీట్లు

పీజీ డిప్లొమా: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
ఎంఎస్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
సీపీఈ: చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్
- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ
- సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ



అర్హత: పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మా ర్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

ఐఐపీ సెట్: ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూలై 14
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 18, 19
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 22
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

నవ్య | చిత్రజ్యోతి

టికెట్ ధరల పెంపుపై సీఎంతో పవన్ చర్చిస్తానన్నారు



- సి. అశ్వనీదత్

కొత్త సినిమాలు విడుదలైన ప్రతిసారీ టికెట్ ధర పెంచాలని ప్రభుత్వాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ఓ విధానం తీసుకురావాలనేదే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిమతమని నిర్మాత సి. అశ్వనీదత్ అన్నారు. టికెట్ ధరల పెంపు అంశం గురించి ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో వెలిబుచ్చిన అభిప్రాయాలపై కొన్ని అపోహలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వాటిపై అశ్వనీదత్ స్పష్టతనిచ్చారు. 'బడ్జెట్‌ను బట్టి టికెట్ ధరలు ఎంతవరకూ పెంచవచ్చు, అలాగే ధరల పెంపు పది రోజులా?, వారమా? అనేది నిర్మాతలంతా కూర్చోని, చర్చించుకొని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో స్వయంగా చర్చిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు' అని తెలిపారు. నిర్మాతలకు అండగా ఉంటానని ప్రేక్షకులకూ, పరిశ్రమ వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని కలసికట్టుగా తీసుకుందాం అని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారని అశ్వనీదత్ ప్రకటనలో తెలిపారు.

పుట్టిన రోజు.. రెండు అప్‌డేట్స్



నందమూరి కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 21వ చిత్రం లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. తన పిడికిలి బిగించి ఫైర్‌తో, కుర్చీలో కూర్చున కల్యాణ్‌రామ్ తన చుట్టూ ఉన్న గూండాలని ఇంటెన్స్‌గా చూస్తున్నట్లు పోస్టర్ పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ కొన్ని డేర్ డెవిల్ స్టంట్స్ చేయనున్నారు. అలాగే ఫైర్ యాక్షన్ ఎపిసోడ్ ప్రధాన ఆకర్షణగా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి చెప్పారు. సీనియర్ నటి విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బింబిసారకు సీక్వెల్

అలాగే కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగానే 'బింబిసార 2' కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'బింబిసార' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్రం వివరాలను వెల్లడించారు. బింబసార కంటే యుగాల ముందు త్రిగర్తల రాజ్యాన్ని ఏలిన లెజెండ్‌ను చూడడానికి సిద్ధంగా ఉండండి' అని శుక్రవారం అనౌన్స్ చేశారు. స్క్రీన్ మీద ఇప్పటిదాకా ఎవరూ చూడనటువంటి స్థాయిలో త్రిగర్తలను ప్రదర్శించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థ నిర్మించే ఈ చిత్రానికి అనిల్ పాదూరి దర్శకుడు.

అన్నింటికీ సమాధానం పార్ట్-2లో ఉంటుంది



సినిమా సినిమాకు అంచెలంచెలుగా ఎదిగిన డైరెక్టర్లు కొందరైతే.. చేసిన కొన్ని సినిమాలతోనే అపారమైన ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకులు కొంతమంది. ఆ రెండో కోవకు వస్తారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. డైరెక్టర్‌గా తొలి ప్రాజెక్ట్ 'ఎవడే సుబ్రమణ్యమ్'తో సున్నితమైన ఎమోషన్స్ ఉన్న సినిమాలను బాగా హ్యాండిల్ చేయగలడని నిరూపించుకున్నారు. రెండో సినిమా 'మహానటితో' మంచి అభిరుచి ఉన్న దర్శకుడిగా పేరు తెచ్చుకుని.. మూడవ సినిమాగా ఇండియాలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాను తెరకెక్కించారు. సినిమాను దృశ్యకావ్యంలా మలచి.. విమర్శకుల చేత, ప్రేక్షకుల చేత బౌరా! అనిపించుకున్నారు నాగ్ అశ్విన్. సినిమా విడుదలైన అన్ని చోట్లా సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతున్న సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటించారు.

"ముందుగా ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మన పురాణాల్లో అద్భుతమైన కథలు ఉన్నాయి. పురాణాలకు కాసింత సృజనాత్మకత జోడించి ఈ సినిమాను తెరకెక్కిద్దామనుకున్నాను. 'మాయాబజార్' సినిమా ఈ ఆలోచనకు స్ఫూర్తి. మొదటగా ఈ సినిమాను ఒక భాగంగానే తెరకెక్కించాలనుకున్నా. షూటింగ్ కూడా ఆ విధంగానే సాగింది. కానీ కొన్ని షెడ్యూళ్ల షూటింగ్ తర్వాత.. ఇంత కాన్వాస్ ఉన్న కథను రెండు భాగాలుగా విడదీద్దాం అనే ఆలోచన వచ్చింది. పార్ట్-2కి సంబంధించి 20 రోజుల షూటింగ్ చేశాం. కథకు న్యాయం చేసే పాత్రల్ని వెతికే సమయంలో సినిమాలోని కీలక పాత్రలకు అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకునే వంటి స్టార్స్ అయితే కరెక్ట్ అని భావించి వారిని తీసుకున్నాం. ఈ సినిమాతో నాలుగున్నరేళ్ల చిత్రబృందం ప్రయాణం చేసింది. ఈ సమయంలో వారెన్నో సవాళ్లను దాటుకొని చిత్ర విజయానికి దోహదపడ్డారు. ప్రభాస్‌కు మొదటి నుంచి సినిమాపై అపార నమ్మకం ఉండేది. ఆయన ప్రోత్సాహమే కష్టసమయాల్లో నన్ను, నిర్మాతల్ని ముందుకు నడిపించింది. సినిమా చూసినవారందరూ అనేక ప్రశ్నలు అడుగుతున్నారు. వాటన్నింటికీ సమాధానం పార్ట్-2లో ఉంటుంది. 'కల్కి' అవతారంలో ఏ నటుడ్ని చూపిస్తాం తెలియడానికి మరింత సమయం ఉంది" అని చెప్పారు.

హాని చేయాలనే తలంపు లేదు



సమంత

టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైద్య వర్గాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. గత వారం సమంత నెబ్యులైజర్‌ను ఉపయోగిస్తున్న ఫోటోను షేర్ చేసి, 'వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు మందులకు బదులుగా హైడ్రోజన్ పెరాక్సైడ్, డిస్టిల్డ్ వాటర్ కలిపి పీల్చితే మేజిక్‌లాగా పనిచేస్తుంది' అని సూచించారు. అయితే ఈ విధానాన్ని కొంతమంది వైద్యులు సోషల్ మీడియాలో తప్పుపట్టారు. అప్పటికే దెబ్బ తిన్న ఊపిరి తిత్తులలోకి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్రవేశిస్తే, న్యుమోనియా సహా పలు వ్యాధులను కలగజేస్తుంది. కొన్నిసార్లు మరణానికి దారి తీస్తుందని హెచ్చరించారు. 'ఇంతకంటే బుద్ధి తక్కువ పని లేదు. సమంతకు ఆరోగ్యం, విజ్ఞానశాస్త్రం గురించి ఏమీ తెలియదు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు ఆమెను జైలుకు పంపాల'ని ఫిలిప్స్ అనే వైద్యుడు సమంతను ఘాటుగా విమర్శించారు. స్పందించాడు. తనపై విమర్శలు రావడంతో స్పందించిన సమంత, మర్యాదకరమైన భాష ఉపయోగించాలని ఆ డాక్టర్‌ను కోరారు. 'ఇవన్నీ నాకు వైద్యులు చెప్పిన సలహాలే , ఎవరికీ చెడు చేయాలనే తలంపు నాకు లేదు. నన్ను లక్ష్యంగా చేసుకునే బదులు, ఈ విధానాన్ని నాకు సూచించిన డాక్టర్‌తో మీరు చర్చ జరిపితే బావుండేద'న్నారు. సమంత వివరణపై శుక్రవారం డాక్టర్ ఫిలిప్స్ స్పందిస్తూ, బాధితురాలిగా చూపించుకునే ప్రయత్నం మానుకోని, నిజా నిజాలు తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సమంతకు సూచించారు. మానిటైజేషన్ కోసమే కొంతమంది సెలబ్రిటీలు ఇలాంటివి చేస్తున్నారని, వారికి ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత లేదన్నారు.

రజనీ రాజసం



లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ సాగుతోంది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు రజనీకాంత్ ఇటీవలే హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం చిత్రీకరణ మొదలుపెట్టినట్లు నిర్మాణసంస్థ సన్ పిక్చర్స్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. దీంతో పాటు రజనీకాంత్ స్టైల్‌గా కుర్చీలో కూర్చొని రాజసం ఉట్టిపడే లుక్‌లో ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

కూలీలో శ్రుతి ఖాయం

'కూలీ' చిత్రంలో శ్రుతీహాసన్ నటించబోతున్నారనే మాట కొన్నాళ్లుగా మీడియాలో వినిపిస్తోంది. కానీ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. శుక్రవారం శ్రుతీహాసన్ ఈ సస్పెన్స్‌కు తెరదించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన ఫొటోను పోస్ట్ చేసిన శ్రుతీ 'కూలీ డే 1 షూటింగ్' అని రాసుకొచ్చారు. దీంతో ఈ చిత్రంలో ఆమె నటించడం ఖాయమైనట్లే.

అడవిలో అందాల భామ



తమిళ హీరో ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున కలయికలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. రష్మిక మందన్న కథానాయిక. శుక్రవారం చిత్రబృందం రష్మిక ఫస్ట్ లుక్, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో రాత్రిపూట డబ్బుతో ఉన్న ట్రాలీ బ్యాగ్‌తో అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న రష్మిక లుక్ ఆసక్తికరంగా ఉంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PZmAgAJ లో చదవండి.

పవర్‌ఫుల్ పెదకాపు



హాస్య నటుడు అలీ కుటుంబానికి చెందిన సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలో పెదకాపుగా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు సాయికుమార్. ఆయన లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. తమ మునుగోడు ప్రాంతానికి చెందిన పారుమళ్ల లింగయ్య నిర్మిస్తున్న 'ప్రణయగోదారి' విజయం సాధించాలని రాజగోపాల్‌రెడ్డి కోరుకున్నారు. 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అన్నివర్గాల వారినీ అలరించే అంశాలు చిత్రంలో ఉన్నాయి. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు ప్రేక్షకులను అలరిస్తాయి. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత పారుమళ్ల లింగయ్య. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

అల్ఫా గర్ల్



యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో ఫస్ట్ ఫిమేల్ లీడ్‌గా అలియా భట్ అరుదైన ఘనత పొందారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అల్ఫా' అనే పేరు పెట్టారు. ఈ టైటిల్‌కు మగవారు మాత్రమే కాదు మహిళలు కూడా అర్హులే అని సమాజానికి గట్టిగా చాటి చెప్పాలనే ధ్యేయంతో ఈ టైటిల్ నిర్ణయించినట్లు ఆదిత్య చోప్రా చెప్పారు. ఇందులో శార్వరి మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన రైల్వే మెన్ చిత్రానికి దర్శకత్వం వహించిన శివ్ రవైల్ ఈ సినిమాకు దర్శకుడు.

ఆడపిల్ల తిరగబడితే...



నటి లావణ్య ప్రధాన పాత్ర పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఇజ్జత్'. పరువు హత్యల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఉపేంద్ర ఎస్‌పీ దర్శకత్వంలో శ్రీను కందుల నిర్మిస్తున్నారు. శుక్రవారం దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి 'ఇజ్జత్' టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'ఒక మధ్య తరగతి అమ్మాయి కథే 'ఇజ్జత్' చిత్రం. పరువు హత్యకు సిద్ధపడిన తల్లితండ్రులకు ఎదురు తిరిగే ధైర్యవంతురాలిగా కథానాయిక కనిపిస్తుంది. ఒక ఆడపిల్ల తిరగబడితే ఎలా ఉంటుందో చెప్పే చిత్రమే మా 'ఇజ్జత్' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'గతంలో పరువు హత్యల మీద వచ్చిన చిత్రాలకు 'ఇజ్జత్' భిన్నంగా ఉంటుంది. కొత్త తరహా కథనంతో క్వాలిటీ విజువల్స్‌తో నిర్మిస్తున్నాం. ఫస్ట్ కాపీ సిద్ధమవుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: వీఆర్‌కే నాయుడు.

వంశధార కాలువలో నీటి ప్రవాహంపై హర్షం



నందిగాం: మండల పరిధిలోని వంశధార ప్రధాన ఎడమ కాలువలో నీటి ప్రవాహం చేరడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో వంశధార అధికా రులు కాలువల్లోని పూడికలు తొలగించడంతో జూలై మొదటి వారంలోనే వంశధార ప్రాజెక్టు నుంచి నీరు చేరడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నందిగాం, కాపు తెంబూరు, ఆనందపురం తది తర గ్రామాల్లో కాలువలు వద్ద నీటిని చూసి హర్షం వ్యక్తంచేశారు.

56ఆర్ కెనాల్ వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



పిచ్చి మొక్కలతో నామరూపాలు కోల్పోయిన ఉదయపురం కాలువ

సాగునీటి కాలువ నాడు.. నేడు

● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతాంగం

చిత్రాల్లో చూస్తున్నారుగా.. ఒకటి వైసీపీ హయాంలో ఉదయపురం సమీపంలోని కాలువ.. పిచ్చిమొక్కలతో నిండి సాగునీరు పారని వైనం.. రెండో ఫొటో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో పిచ్చి మొక్కలు, పూడికలు తొలగించిన తరువాత అదే కాలువ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటిని పుష్కలంగా పొంది పంటలు సాగు చేసుకున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి రంగంపై పూర్తి నిర్లక్ష్యంతో కాలువలు నామరూపాల్లేకుండా పోయాయి. ఇటీవల మంత్రి ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో తక్షణం సాగునీటి కాలువలను బాగు చేయించాలని ఆదేశించడం స్థానిక నేతల పర్యవేక్షణలో పూడికలు తొలగించి సాగునీరు శివారు ప్రాంతాలకు పారేలా తయారు చేశారు. పనులను పూర్తి చేసి త్వరితగతిన సాగునీరందించేందుకు చర్యలు చేపడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

-సంతబొమ్మాళి



పూడికతీత అనంతరం ఇలా..

వసతిగృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

టెక్కలి: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు కోరారు. ఈ మేరకు శుక్రవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి హాస్టల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని అనేక పర్యాయాలు అధికారులను కోరినా పట్టించుకోలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న వసతిగృహ సంక్షేమాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తరుణ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కౌలు రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

నరసన్నపేట: కౌలు రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం ఉంటుందని ఏవో సునీత అన్నారు. శుక్రవారం కోమర్తి, యారబాడు గ్రామాల్లో కౌలురైతుల గుర్తింపు సభలను నిర్వహించారు. ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు సూర్యనారాయణ, శిమ్మ జగన్నాథం, ముద్దాడ అప్పలనాయుడు, పూతి రమణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి

కరకవలస(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో యజమానుల నుంచి భూమిని తీసుకుని సాగు చేసుకుం టున్న కౌలు రైతులు ప్రభుత్వ పథకాలను పొందాలంటే గుర్తింపు కార్డులు తప్పనిసరని వ్యవసాయాధికారి పి.లతాశ్రీ అన్నారు. కరకవలస గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం రైతులకు అవసరమైన డీఏపీ, యూరియాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్యామలాపురం ఆర్అండ్ఆర్‌కాలనీ సర్పంచ్ బి.లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.మనోహర్‌నాయుడు, నాయకులు వి.ఆనందరావు, బి.కృష్ణారావు, బి.బాలకృష్ణ, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేది టీడీపీ ప్రభుత్వమే..

మెళియాపుట్టి: రైతులను ఆదుకునేది టీడీపీ ప్రభుత్వమని జాడుపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కదంబల సుజాత అన్నారు. శుక్రవారం జాడుపల్లిలో కౌలురైతుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం వహించిందని, దీంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటి కాలువలు బాగు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో దానకర్ణుడు, పైడిరాజు, కోదండ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం-1, 2 కేంద్రాల్లో రైతు సదస్సులు

నందిగాం: నందిగాం-1, 2 రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం కౌలు రైతుల అవగాహనా సద స్సులు నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ కౌలురైతులు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కె.ప్రసాదరావు, బి.గిరిబాబు, రవికుమార్, ప్రసాదరావు, చలపతి రావు, వీఆర్వో అరుణ్‌కుమార్, వీపీఏలు అరవింద్, హారతి పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లను నియమించండి

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులో ఉన్న రెండు సచివాలయాలకు డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మాజీ కోఆప్షన్ సభ్యుడు, టీడీపీ నాయకుడు కదంబాల వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాడుతూ.. డిజిటల్ అసిస్టెంట్ నియామకంపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినాస్పందన లేదన్నారు. దీంతో కుల, ఆదాయ ధ్రువపత్రాలకోసం విద్యార్థులు, మ్యుటేషన్ల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదివేలు జనాభా ఉన్న నువ్వలరేవు గ్రామంలో ఉన్న సచివాలయాలల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు.

తాగునీటి ఇబ్బందులను తొలగించండి

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట గ్రామంలో తాగునీటి సరఫరాకు కొందరు అడ్డు తగలడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వంక సత్యరాజు, ఎంపిటిసి వంకరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో తిరుమలరావుతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. తక్షణం తగు చర్యలు తీసుకుని నీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరారు.

రేపటి నుంచి జగన్నాథ రథోత్సవాలు

జలుమూరు: జగన్నాథ రథోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జలుమూరు, బైరాగిపేటలోని జగన్నాథ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆదివారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో రోజుకొక అవతారంలో స్వామి దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం తొలి రథయాత్ర సందర్భంగా బలబద్ర, సుభద్ర, జగన్నాథ మూర్తులను రథంపై వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. 11న హీరా పంచమి సందర్భంగా మహాలక్ష్మి అవతారంలో గ్రామోత్సవం, 16న మారు రథయాత్ర నిర్వహించనున్నా మని, భక్తులు పాల్గొని స్వామి అవతారాలను దర్శించుకుని తరించాలని నిర్వాహకులు కోరారు.

శివాలయం నిర్మాణానికి స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్ఆర్ కాలనీ యువకులు

హిరమండలం: సుభలయ ఆర్ఆర్ కాలనీ పంచాయతీలో శివా లయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని పంచాయతీకి చెందిన యువ కులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. వంశధార రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ముంపునకు గురైన 6 గ్రామాల నిర్వాసితులకు సుభలయ వద్ద పునరావాసం కల్పించారన్నారు. అయితే ఆలయానికి ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదన్నారు. అనేక పర్యాయాలు జిల్లా ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్లగా సర్వే చేసి స్థలం పరిశీలించి గత తహసీల్దార్‌కు నివేదిక అందిం చారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని స్థలం కేటాయించాలని కోరారు.

వర్షంతో అన్నదాతల హర్షం

హరిపురం/ఎల్ఎన్‌పేట: ఎండ వేడిమి.. ఉక్కబోత వెరసి గత కొద్దిరోజులు గా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. వర్షం లేకపోవడంతో పంటలు సాగు చేసే రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ కోసం నారు పోసిన అన్నదాతలు వర్షం కోసం ఎదురు చూస్తున్న సమయంలో కురిసిన వర్షం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. మందస మండలంతో పాటు, ఎల్ఎన్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో విత్త నాలు వేసిన పొలాల్లో నీరు చేయడంతో విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ వర్షంతో ప్రజలు కొంతమేర ఉపశమనం పొందారు.





హరిపురం, ఎల్ఎన్‌పేట మండలం తురకపేటలో కురుస్తున్న వర్షం

వైద్యులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జూలై 3: నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో అందించే వైద్య సేవల్లో జిల్లా లోనే మంచి పేరు ఉండేదని, అయితే ప్రస్తుతం రోగుల తాకిడి ఎందుకు తగ్గిందో వైద్యులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక 100 పడ కల సామాజిక ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి ఆసుపత్రిలో వైద్యసేవలపై రోగుల నుంచి ఆరా తీశారు. ప్రసూతి విభాగంలో గతంలో నెలకు 350 వరకు ప్రస వాలు అయ్యేవని, ఇప్పుడు ఆ పరిస్థితి ఎందుకు లేదని సూపరింటెండెంట్ డా.జయశ్రీని ప్రశ్నించారు. 20 మంది వైద్యులతో కలిపి 96 మంది సిబ్బంది ఉన్నా ఓపీ తక్కువగా ఉండడమే కాకుండా ఇతర వ్యాధులబారిన పడిన వారు ఎందుకు ఆసుపత్రికి రావడం లేదో అర్థం కావడం లేదన్నారు. వైద్యులు అంటే తనకు ఎంతో గౌరవమని ప్రతీ ఒక్కరు తమ విధులను సక్రమంగా నిర్వహించి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అత్యవసర సమయాల్లో డ్యూటీ చార్ట్ ప్రకారమే కాకుండా అదనంగా పనిచేసేందుకు సిద్ధం కావాలన్నారు. రోగులకు అందించే డైట్‌ను సక్రమంగా అందించేందుకు ఏజెన్సీను మార్పు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొద్దు చిట్టిబాబు, ఎం.వెంకటప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, జామి వెంకట్రావు, కింజరాపు రామారావు, బోయన సతీష్ తదితరులు పాల్గొన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఫీల్డ్ అసిసెంట్‌ను తొలగించాల్సిందే..

'ఉపాధి' వేతనదారుల డిమాండ్: ఏపీడీ విచారణ

డీఎల్‌పురం(పోలాకి): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడుతూ సక్రమంగా విధులు నిర్వర్తించ కుండా నిధులు దుర్వినియోగం చేస్తున్న క్షేత్ర సహాయకు రాలిని తొలగించాలని దండులక్ష్మీపురం వేతనదారులు కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై జిల్లా ఉన్నతాధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఉపాధి ఏపీడీ బి.మురళీకృష్ణ శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వేతనదారులు అక్కడికి చేరుకుని క్షేత్రసహాయకురాలు తులసిని తప్పించాల్సిందేనని భీష్మించారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో తనకు నచ్చిన వారికి మస్టర్ వేయడం, పనికి వెళ్లకుండా వేతనం చెల్లించడం, పెద్దలపై కనీస గౌరవం లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ ఫిర్యాదు చేయగా మీరు విచారణకు వచ్చినా ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, వైసీపీ నేతలు చెప్పిన వారికే మస్టర్లు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులు, ఫీల్డ్ అసిస్టెంట్ మధ్య వాదోపవాదాలు జరిగాయి. సుమారు అరగంట పాటు ఏపీడీ ఎదుట వారు వాదించుకున్నారు. అనంతరం సచివాలయం బయటకు వచ్చి ఫిర్యాదుదారులు, క్షేత్రసహాయకురాలి అనుచరులు పెద్ద స్వరంతో వాదించుకున్నారు. విచారణకు వచ్చిన అధికారులు ఫిర్యాదుదారుల నుంచి వాంగ్మూలాన్ని తీసుకుని వెనుదిరిగారు. కార్యక్రమంలో ఏపీఓవో రమణారావు, ఈసీ పి.మునీందర్, గ్రామపెద్ద కరుకోల రామారావు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం బయట వాదులాడుకుంటున్న ఫిర్యాదుదారులు, ఫీల్డ్ అసిస్టెంట్ వర్గీయులు

చెరువు ఆక్రమణలపై మౌనమెందుకు?

● గ్రామ సభలో అధికారులను నిలదీసిన సభ్యులు

హరిపురం: మండలంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హరిపురం గ్రామంలో విలువైన ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలపై ఐదేళ్లుగా ఎందుకు మౌనం వహించారని పంచాయతీ అధి కారులను పలువురు సభ్యులు ప్రశ్నించారు. శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు గొలుసు చంద్రశేఖర్, ఇప్పిలి వెంకటరమణ మాట్లాడుతూ.. గ్రామంలోని గంటవాని బంద, శ్మశాన వాటిక పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని వాపోయారు. సచివాలయంలో సుమారు 15 మంది సిబ్బది ఉన్నా ఆక్రమణలపై స్పందించలేదన్నారు. గ్రామ కంఠం ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఎలా విద్యుత్తు మీటర్లు మంజూరు చేశారని కార్యదర్శి జగదీష్‌ను నిలదీశారు. దీనిపై కార్యదర్శి మాట్లాడుతూ.. ఆక్రమణలను సర్వే చేయించి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తం, ఎంపీటీసీ అనల అప్పన్న, మాజీ ఎంపీటీసీ బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు దేవు, వెంకటరావు, జగ్గారావు, కనగల తేజ పాల్గొన్నారు.

సమస్యలపై గ్రామసభలో నిలదీత

నందిగాం: ప్రతాపవిశ్వనాథపురంలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ కోనారి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు సభ్యులు, గ్రామస్థులు వివిధ సమస్యలపై నిలదీశారు. పంచాయతీలో నిధులున్నప్పటికీ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. దీంతో సర్పంచ్ దాటవేత ధోరణి అవలంబించడాన్ని నిరసిస్తూ సభ నుంచి నినాదాలు చేస్తూ బయటకు వచ్చేశారు. పంచాయతీ పరిధిలోని చెరుకుపల్లిలో మురికి కాలువ, తాగునీటి సమస్యలున్నప్పటికీ పరిష్కరించలేదేమని ఆర్.సీతారాం, తరిణిప్రసాద్, ధర్మారావు, ఢిల్లీరావు ప్రశ్నించారు. కార్యదర్శి కె.ధనుంజయరావు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్థులను గుర్తించాలి

మందస: క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి అవసరమైన మందులు అందించాలని పలాస యూనిట్ క్షయవ్యాధి నివారణాధికారి జనార్దన నాగసాయి తెలిపారు. శుక్రవారం మందస పీహెచ్‌సీని సందర్శించి క్షయవ్యాధి రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ టెక్నీషియన్ వై.నాగరాజు గతనెల 26వ తేదీ నుంచి శుక్రవారం వరకు విధులకు హాజరుకాలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి నివేదికను జిల్లా క్షయవ్యాధి నివారణాధికారికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సంపత్ కుమార్, సూపర్‌వైజర్ ఎన్.గిరి, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.జనార్దన నాగసాయి

సంఘాలుగా ఏర్పడితే ప్రయోజనం

టెక్కలి: మత్స్యకారులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం అందించే ఆర్థిక, ఇతర అంశాల్లో స్వావలంబన సాధించేందుకు దోహదపడతాయని మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రో అన్నారు. శుక్రవారం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మత్స్యకార సొసైటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘాలు క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించుకొని వ్యాపారాభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పద్మనాభం, కార్తీక్‌బెహరా, హెరంబో, గోపీ బెహరా, హన్నూరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పాతపట్నం/జలుమూరు: అమరావతి నిర్మాణంలో నేను సైతం అంటూ కొరసవాడ గ్రామానికి చెందిన మడ్డు గౌరీశంకర్ నాయుడు తన నెల వేతనాన్ని మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం అందించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో జూనియర్ రెసిడెంట్ వైద్యుడిగా పని చేస్తున్న గౌరీ శంకర్ తన వేతనం మొత్తం రూ.లక్ష విరాళాన్ని లోకేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గౌరీశంకర్‌ను మంత్రి అభినందించినట్లు తండ్రి, సారవకోట మండల విద్యాశాఖాధికారి మడ్డు వెంకటరమణ తెలిపారు.



మంత్రి లోకేష్‌కు విరాళాన్ని అందిస్తున్న డా.గౌరీ శంకర్

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జలుమూరు: బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తిమడాం ఫీడర్‌లో ఉన్న గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా అధిక లోడ్ ఫీడర్లను విడగొట్టే పనుల్లో భాగంగా 33/11 బుడితి సబ్‌స్టేషనులో గల అన్ని ఫీడర్‌లను షట్ డౌన్ చేయడం జరుగుతుందన్నారు. అందువల్ల ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు అచ్యుతాపురం, శ్రీముఖలింగం, బుడితి, వడ్డినవలస, బొడ్డపాడు, కొమనాపల్లి, సురవరం, కరకవలస, భైదలాపురం, తిమడాం, పర్లాం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు చిక్కాలవలస రైల్వే అండర్ పాసేజ్ మూసివేత

నరసన్నపేట: చిక్కాలవలస గ్రామం వద్ద ఉన్న రైల్వే అండ్ పాసైజ్ వంతెనను శనివారం మూసి వేస్తున్నట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారి మోహన్ తెలిపారు. అండర్ పాసైజ్ వంతెనలో వర్షపు నీరు చేరడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, వర్షపునీరు సజావుగా వెళ్లేలా పనులు చేపట్టనున్న నేపథ్యంలో సుందరాపురం, కూర్మనాథపురం, రామయ్యవలస, గొటివాడ, తిమడాం, బుడితి వెళ్లే మార్గాన్ని శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటలు వరకు మూసి వేస్తున్నట్లు తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు గుర్తించాలని ఒక ప్రకటనలో కోరారు.

12న దేవాలయ భూముల కౌలుకు వేలం

నరసన్నపేట: గార మండలం ఆరంగిపేట గ్రామంలోని బద్దిగారమ్మ అమ్మవారి ఆలయానికి చెందిన భూములు కౌలుకు ఈనెల 12న నరసన్నపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో తమ్మినేని రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరంగి పేటలోని 4.78 ఎకరాల పల్లపు భూములు మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలంతో పాటు టెండర్ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు నరసన్నపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా సాంబమూర్తి

నరసన్నపేట: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యదర్శిగా టేకి సాంబమూర్తిని ఎన్నుకున్నట్లు సంఘ అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం సమావేశం సంఘ భవనంలో నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులకు సంఘం అండగా ఉంటుందని కార్యదర్శి సాంబమూర్తి అన్నారు. అనంతరం వైద్య పరీక్షలను నిర్వహించారు.

నాడు-నేడు ఖర్చుల వివరాలు తెలపండి

మెళియాపుట్టి: పెద్దపద్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ఖర్చు చేసిన నిధుల వివరాలు తెలియజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలన్నారు. పాఠశాల అభివృద్ధి చెందాలంటే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాలలపై దృష్టి సారించినందున ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లి శ్రీధర్, ఉర్లన వసంత్ తదితరులు పాల్గొన్నారు.

49ఆర్ కాలువల్లో పూడిక తొలగించాలి

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీ పరిధి 49ఆర్ కాలువ ఆక్రమణకు గురైందని, ఆక్రమణలతో పాటు పూడికలు తొలగించాలని టెక్కలి మండల తెలుగుయువత నాయకుడు సత్తారు మనోజ్ కుమార్, రైతులు బమ్మిడి మోహనరావు, ధవళ శ్రీను తదితరులు కోరారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా ఈ కాలువలో పూడికలు తీయలేదని, ఆక్రమణలకు గురైనా తొలగించలేదన్నారు. ఈ కాలువ ద్వారా 200 ఎకరాలకు సాగు నీరందే అవకాశం ఉందని తక్షణం తగు చర్యలు తీసుకుని సాగు నీరందించాలని కోరారు. వారితో పాటు ధర్మారావు, వెంకటరమణ, రమేష్ ఉన్నారు.

అచ్చెన్న చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

సంతబొమ్మాళి: రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో నౌపడ పంచాయతీ సీతానగరంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని టీడీపీ నాయకుడు వాడరేవు కృష్ణారావు తదితరులు తెలిపారు. గ్రామంలో రక్షిత నీటి పథకానికి సింగిల్‌ఫేజ్ విద్యుత్ సరఫరా వల్ల ఐదేళ్లుగా సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా విద్యుత్ శాఖాధికారులతో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఈమేరకు సీతా నగరం మొసలిగెడ్డ నుంచి పాఠశాల వరకు కొత్త విద్యుత్ లైన్‌తో పాటు రెండు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఖాతాదారులకు తపాలా సేవలు దూరం

హిరమండలం: సుభ లయ ఆర్ఆర్ కాలనీలోని సబ్ పోస్టాఫీసు గత వారం రోజు లుగా తెరవక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉపాధి వేతనదారులు నగదు తీసుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కార్యాలయం ఎందుకు తెరవడం లేదో తెలియడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ పట్టేనా?

- వైసీపీ హయాంలో నిలిచిన పనులు
- టీడీపీ ప్రభుత్వంపై రైతుల ఆశలు

(కంచిలి)

మండల పరిధిలో సాగునీటికి అవసరమైన జల వనరులు సమృద్ధిగా ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పంటలకు సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి టీడీపీ హయాంలో నిధులు మంజూరైనా వైసీపీ పాలనలో పనులు జరగలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటం, కేంద్రంలో సైతం సానుకూల ప్రభుత్వం ఉండడంతో ఈ సారైనా మండలంలోని సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సుంకిలి సాగరం వద్ద పాడైపోయిన మదుము

అభివృద్ధికి ఎదురుచూపులు..

మండలంలో మినీ రిజర్వాయర్‌గా పిలుస్తున్న గంగాసాగరం, గోవిందసాగరం, సుంకిలి సాగరం, లొద్దాలొద్ది, ముకుందసాగరం, హనుమత్ సాగరంతోపాటు చిన్నా, పెద్దా సాగునీటి చెరువులు సైతం చాలానే ఉన్నాయి. అయితే ఏటా మండల రైతాంగం మాత్రం తమ పంటల సాగుకు వర్షాలపైనే ఆధారపడుతున్నారు. దీనిబట్టి మండలంలో ఉన్న సాగునీటి వనరులు ఎంతటి నిర్లక్ష్యానికి గురవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

నిధులు లేక నిలిచిన గంగాసాగరం పనులు

సుమారు 1200 ఎకరాల ఆయకట్టు కలిగి, మండలంలోనే అతిపెద్ద సాగునీటి వనరుగా పేరుగాంచిన గంగాసాగర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా, కొనసాగుతూనే ఉంది. 2007లో తొలిసారిగి రిజర్వాయర్‌గా ఏర్పాటు ప్రతిపాదనలు వచ్చి, భూ సేకరణ చేశారు. మూడు కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించినా పూర్తి కాలేదు. అనంతరం 2019 ఫిబ్రవరి 15న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ 6.3 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి సాగరం చుట్టూ రాతితో గట్టు కట్టారు. అయితే తరువాత పనులకు నిధులు విడుదల కాకపోవడంతో మళ్లీ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలంటే మరో నాలుగు కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. దీనికితోడు రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలను సైతం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో రైతుల ఆశలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



అభివృద్ధికి నోచుకోని గంగాసాగరం రిజర్వాయర్

మిగిలిన సాగరాలదీ అదే దుస్థితి

మండలంలోని ముండల గ్రామానికి సమీపంలో కొండల దిగువన ఉన్న సుంకిలి సాగరానికి 350 ఎకరాల ఆయకట్టు, డోల గోవిందపురం వద్ద నున్న గోవిందసాగరానికి 150 ఎకరాల ఆయకట్టు ఉంది. అయినప్పటికీ పాలకులు ఈ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆవేదనలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్న ఐదేళ్ల రైతుల కోసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వానికి ఈసారి ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. అయితే ఈసారైనా మండల పరిధిలోని సాగు నీటి సాగరాలకి మోక్షం లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

మహిళపై మూకుమ్మడి దాడి

- ఐదుగురిపై కేసు నమోదు

లావేరు: తాళ్లవలసకు చెంది వాళ్లే రాధ అనే మహిళపై ఆదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు బుధవారం మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వాళ్లే రాధ ఈ నెల 3న గ్రామంలోని పాల కేంద్రం వద్దకు పాలు తీసుకుని వెళ్లి వస్తుండగా.. కాపువీధిలో నివాసం ఉంటున్న సంచాన సత్యనారాయణ, రేవతి, మీసాల ఈశ్వరమ్మ, రమేష్, క్రిష్ణవేణి కలిసి రాధపై దాడికి దిగారు. ఆమె చీరను లాగేసి చితకబాదారు. దీంతో ఆమె గురువారం లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాత గొడవులే దాడికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు తెలిపారు. తాను టీడీపీ సానుభూతిపరులుగా ఉన్నందునే ఇలా దాడికి పాల్పడ్డారని బాధితురాలు రాధ ఆవేదన వ్యక్తం చేసింది.

విద్యుదాఘాతంతో లారీ క్లీనర్ మృతి

నందిగాం: జడ్యాడ సమీపంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై లారీ క్లీనర్ అత్తిని వెంకటరావు(36) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం కొత్తపేట తారకరామ కాలనీకి చెందిన వెంకటరావు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం జడ్యాడ సమీపంలో కాలువ పనులు పూర్తి చేసుకొని ఎక్స్‌కవేటర్‌ను లారీపై ఎక్కించి మెళియాపుట్టి మండలం తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో 11 కేవీ విద్యుత్ వైర్లు ఎక్సకవేటర్‌కు తగలడంతో ఆయన షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటరావు భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ.. లారీడ్రైవర్ డి.రాముపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వెంకటరావుకి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

హరిపురం: కొండలోగాం పంచాయతీ చాపరాయి గ్రామంలో సెబ్ సీఐ జైభీం ఆధ్వర్యంలో శుక్రవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లం ఊటలు, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. సారా తయారీ, రవాణాపై పూర్తి నిఘా పెట్టామని, ఇందుకు సంబంధించిన వివరాలు తెలిసినవారు 9440902358 ఫోన్ నెంబరులో తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతాన్నారు. దాడుల్లో సిబ్బంది కాంతారావు, భీమారావు, మోహనరావు పాల్గొన్నారు.

చెరువు కాదు.. రహదారే



సరుబుజ్జిలి జంక్షన్‌లో చెరువును తలపిస్తున్న బత్తిలి-అలికాం రోడ్డు

సరుబుజ్జిలి: కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్‌లో చిన్నపాటి వర్షం కురిస్తే చాలా ప్రధాన రహదారి ఇలా చెరువులా మారిపోతుంది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులను సరుబుజ్జిలి జంక్షన్ ఇలా వర్షపునీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. ఇక్కడి కల్వర్టులు మూసుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకవడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

ఎచ్చెర్ల: నాగావళి నది తీరం పొన్నాడ నుంచి విశాఖకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను చిలకపాలెం వద్ద జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తారకేశ్వరరావు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేయండి

అరసవల్లి: జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరిగితే ప్రజలు వెంటనే ఫిర్యాదు చేయాలని ఫోన్ నెంబర్లను ప్రభుత్వం రిలీజ్ చేసింది. ఈ మేరకు టోల్ ఫ్రీ నెంబరు 1800-425-6012, ల్యాండ్ లైన్ నెంబరు 08942 - 293229, వాట్సాప్ నెంబరు 9701691657 ప్రభుత్వం విడుదల చేసింది.

నగరంలో ట్రాఫిక్ జామ్



గొంటివీధి వద్ద నిలిచిన వాహనాలు

గుజరాతీపేట: నగరంలో వన్‌వే రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయింది. డే అండ్ నైట్ నుంచి రామలక్ష్మణ జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు శుక్రవారం సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టిన సమయంలో విద్యార్థులతోపాటు వాహనచోదకులకు తీవ్ర అంతరాయం కలిగించింది. ముఖ్యంగా పీఎస్ఎన్ఎం స్కూల్ నుంచి గొంటివీధి, సరస్వతిమహల్ వరకు ఎక్కువ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. అదే సమయంలో కళాశాలల బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలతోపాటు ఆర్టీసీ బస్సులు ఇదే దారిలో రావడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. దీనికితోడు కాలువల్లో మురుగు నీరు వల్ల పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కోవడంతో పూడిక పనులు మున్సిపల్ అధికారులు చేపట్టడంతో రోడపైనే టన్నుల కొద్ది మురుగు, ఇసుక, రాళ్లు నిండుకున్నాయి. అటువైపు వెళ్లే ప్రజలు ఇబ్బందిపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు జంక్షన్‌లకే పరిమితమయ్యారు.

కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేయాలి

సరుబుజ్జిలి: వైసీపీ ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేసి 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేసి గ్రామసభలు ద్వారా కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులను అందించాలన్నారు. పంట నమోదు ఈ క్రాప్ బుకింగ్ కౌలు రైతుల పేరుతోనే నమోదు చేయాలని, పంట రుణాల బీమా నష్టపరిహారం రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల కార్యదర్శి టి.ధనుంజయరావు, పేడాడ గన్నయ్య, ఎం.మురళీ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శిగా శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూ టనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.శ్రీనివాసరావుకు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత నియామక ఉత్వర్వులను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలలకు సంబంధించి క్రీడా నిర్వహణ తదితర అంశాలను స్పోర్ట్స్ కార్యదర్శి పర్యవేక్షిస్తారని రిజిస్ట్రార్ తెలిపారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న రిజిస్ట్రార్

అమరావతికి ఎంపీ కలిశెట్టి ఒక నెల జీతం

రణస్థలం: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అమరావతి రాజధాని నిర్మాణానికి తన ఒక నెల జీతాన్ని సీఎం చంద్రబాబుకు అందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. అమరావతి, పోలవరంతో పాటు కీలక ప్రాజెక్టులకు చేయూత నివ్వాలని కోరారు. ఆయన వెంట ఏపీకి చెందిన ఎన్డీఏ ఎంపీలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి తన తొలి నెల జీతం రూ.1.57 లక్షల చెక్కును చంద్రబాబుకు అందించారు. దీంతో కలిశెట్టిని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఎంపీ కలిశెట్టి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పొందూరు, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాలతో పాటు ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షించారు. గత ఐదేళ్ల పాలనలో చోటు చేసుకున్న వివిధ సమ స్యలపై ఆరాతీశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏఎస్పీ ప్రేమ్ కాజల్

ఎచ్చెర్ల: పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ అవసరమని ఏఎస్పీ (అడ్మిన్) జి.ప్రేమ్‌కాజల్ అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు పెరేడ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ఉత్సాహంగా సేవలందించగలరని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీసీబీ సీఈవో

కలెక్టరేట్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను డీసీసీబీ సీఈవో వరప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందిస్తున్న రుణాల లక్ష్యాలను సీఈవో కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో డీసీసీబీ ద్వారా అందిస్తున్న సేవలను, వార్షిక ప్రణాళికను కలెక్టర్‌కు తెలియజేశారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీసీసీబీ సీఈవో వరప్రసాద్

పోషకాహారం అందివ్వాలి..

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు సకాలంలో పోషకాహారం అందివ్వాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.నాగరాణి అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలో గల కస్పాజాలార వీధి-2, కొత్తవీధి అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న టీహెచ్ఆర్‌లో ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసే పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.చిన్మయదేవి చేతుల మీదుగా పోషక ఆహార పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఏసీడీపీవో లావణ్య,సూపర్‌వైజర్లు సుజాత పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

కంచిలి: జలంత్రకోట, బూరగాం పంచాయతీల పరిధిలో పైడిగాం మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ చానెల్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వి.నీరజ, ఏపీవో జి.ధనుంజయతో కలసి శుక్రవారం పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో చానెల్ ద్వారా ఖరీఫ్ పంటకు సకాలంలో నీరందించేలా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏలు వంశీ, బాషా ఫీల్డ్ అసిస్టెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరిపేటలో 'నేను బడికి పోతా'

గార: కుమ్మరిపేటలో సహిత విద్యా కేంద్రం వద్ద శుక్రవారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయ కర్త అమ్మినాయుడు, జిల్లా సమన్వయ కర్త వి.ఉమా, గార ఎంఈవో, ఎస్.రామకృష్ణ, ఎంఈవో-2 వినోదిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుగురు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పభుత్వ పాఠశాలల్లో చేర్పించి భవిత కేంద్రాలు ద్వారా అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సహిత విద్యా అధికారులు

రైతులకు అండగా ఉంటా



కాలువ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల: రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. నారాయణపురం కుడికాలువలో పూడికతీత పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కాలువలో పూడికలు, గుర్రపు డెక్క ఉండడంతో శివారు భూములకు సాగునీరు అందడంలేదని కూటమి నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కాలువ ద్వారా సాగునీరు సరఫరాకు అడ్డంకి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. దీంతో శుక్రవారం పెయ్యిలవానిపేట వద్ద కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ పూర్వపు మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు సంపతిరావు నాగేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ, గాలి వెంకటరెడ్డి, గూరు జగపతిబాబు, నక్క లక్ష్మణరావు, పంచిరెడ్డి కృష్ణారావు, అన్నెపు భువనేశ్వరరావు, పైడి ముఖలింగం, మెండ రాజారావు, పైడి అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణా తరగతులను ఎమ్మెల్యే సందర్శించారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

గుజరాతీపేట: హెల్మెట్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ఉపయోగకరమని, మోటారు వాహనాల చట్టం కింద రూపొందించిన నియమాలు, నిబంధనలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.ఇందరా ప్రసాద్, పాపినాయుడు, మధ్యర్తిత్వ న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నిందితులకు న్యాయ సేవలు

జైలులో ఉన్న నిందితులకు న్యాయసేవలు అందించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం జైలు న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిందితులకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. జైలులో ఉండే ఖైదీల పరిస్థితులు, బాగోగులు, వారి అవసరాలను ఎలా తెలుసుకోవాలో వివరించారు.

అర్హులకు సీసీఆర్‌సీ కార్డులు

ఇచ్ఛాపురం: అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ(కౌలు గుర్తింపు)కార్డులు అందిస్తామని, అందులో భాగంగానే కౌలు రైతులకు కార్డులపై అవగాహన కల్పిస్తున్నట్టు ఏవో టి.భార్గవి అన్నారు. శుక్రవారం కొఠారి, ఈదుపురం, బెల్లుపడ గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు కార్డులు జారీపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్, రబీ పంట కాలానికి సాగుచేసే కౌలు రైతులకు తప్పనిసరిగా రెవెన్యూ శాఖ జారీచేసే గుర్తింపు కార్డు తీసుకోవాలని తెలిపారు ఈ సందర్భంగా గత ఏడాది సేకరించిన మట్టి నమూనా పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రైతులు ఆశి జీవులురెడ్డి, సహదేవ్‌రెడ్డి, ఎన్.ఢిల్లీ, పీతాంబరు, రైతులు పాల్గొన్నారు.

స్పేర్ పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

- లక్షల్లో ఆస్తి నష్టం

ఎచ్చెర్ల: కుశాలపురం బైపాస్ కూడలి వద్ద రాజేరాజేశ్వరి ఆటో స్పేర్‌పార్ట్స్ దుకాణంలో శుక్రవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కుశాలపురం గ్రామానికి చెందిన దుకాణం యజమాని పైడి ఆనందరం వ్యాపారం ముగించుకుని రాత్రి 8గంటల తర్వాత ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడి అరగంట తర్వాత దుకాణం నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో స్థానికులు గుర్తించి ఆనందరావుకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఆనందరావు వెంటనే శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది తెలియజేడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా ఈ ఘటనలో సుమారు రూ.50 లక్షలు నష్టం వాటిల్లినట్టు షాపు యజమాని తెలిపారు.



దగ్ధమైన సామగ్రి

వర్షం కురవక..



విత్తనాలపై నీళ్లు పోస్తున్న దృశ్యం

లావేరు: మండలంలో గత కొన్ని రోజులుగా వర్షం కురవక పోవడంతో విత్తనాలు మొలక రాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక చేసేదేమీ లేక సమీపంలోని చెరువులు, వాగుల నుంచి బిందెలతో నీటిని తెప్పించి ఇలా విత్తనాలపై పోయిస్తున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు సంబంధించిన విత్తనాలు వేసినా మొలకు రారాలేదు. ఇప్పటికే విత్తనాల కోసం వేలాది రూపాయలు వెచ్చించగా, అవి మొలకలు రాకపోవడంతో కూలీలను పెట్టి నీటితో తడిపిస్తుండడంతో అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా ఇసుక సరఫరాపై హర్షం

అరసవల్లి: ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఉచిత ఇసుక సరఫరాతో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, కార్మికులకు ఉపాధి దొరికి ఎంతో మేలు జరుగుతుందని ఏఐటీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు మార్కెట్ యార్డు ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షన్ముఖరావు విలేకరులతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ వల్ల నిర్మాణ రంగం కుదేలయిపోయిందని, ఇసుక సంక్షోభాన్ని సృష్టించి భవన నిర్మాణ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న 46వేల క్లెయిమ్స్‌ను తక్షణమే పరిష్కరించాలని కోరారు. నాయకులు టి.తిరుపతిరావు, ఉప్పాడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైం: గత నెలలో అనారోగ్యం బారినపడి మరణించిన హోంగార్డు జి.దాలయ్య కుటుంబానికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక చెక్కు అందజేశారు. జిల్లాలోని హోంగార్డులు అందరూ కలిసి ఒక్కరోజు గౌరవ వేతనం మొత్తం రూ.4.16 లక్షలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. దాలయ్య మృతి బాధాకరమని, వీలైనంత త్వరగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని హోంగార్డుగా నియ మిస్తామని భరోసా ఇచ్చారు. ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ హోంగార్డు ఆర్ఐ సురేష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇచ్ఛాపురం: మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మిషన్ సంకల్ప కార్యక్రమంలో భాగంగా పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుగ్గ ప్రేమ్ కుమార్, చాట్ల పుష్ప, మహిళా కార్యదర్శి సూర్యకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సుజాత, ఎస్.నీలవేణి, ఉపా ధ్యాయులు దేవరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువగా ఆదాయం ఉన్నవారిని గుర్తించాలి

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాల్లో రూ.10 వేల లోపు కుటుంబ ఆదాయం ఉన్న మహిళలను గుర్తించి తెలియజేయాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం దూసి పంచాయతీలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాల్లో జీవనోపాధి మెరుగుపరిచేందుకు అవసరమైన రుణ సౌకర్యం స్త్రీనిధి ద్వారా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ పతినిధులతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, వీవోఏ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

ఇచ్ఛాపురం: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. శుక్రవారం తేలుకుంచి గ్రామంలో వీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంఘాల పుస్తక నిర్వహణ సంబంధిత సంఘ సభ్యులు మాత్రమే రాసుకోవాలన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు మైగ్రేషన్ అయిన లబ్ధిదారులు ప్రతీ నెలా శతశాతం హాజరయ్యేలా చూడాలన్నారు.

ధ్వజ స్తంభానికి రూ.లక్ష విరాళం

కవిటి: బొరివంక గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఆనంద రౌళో కుటుంబ సభ్యులు ధ్వజ స్తంభం తాపడం పెట్టడానికి తన వంతుగా రూ. లక్ష విరాళాన్ని అందించారు. శుక్రవారం ముత్యాలపేట మహామృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో అందించారు. ధర్మకర్త చంద్రశేఖరం, శివాజీ, ఎం.వెంకటరావు, డి.సతీష్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

కంచిలి: జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ర్యాబిస్ నిరోధక టీకాలు శనివారం కంచిలి పశువైద్యకేంద్రంలో వేయనున్నట్టు పశువైద్యాధికారిణి టి.శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కలను పెంచుకుంటున్నవారు వినియోగపరుచుకోవాన్నారు.

- **రణస్థలం:** ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని పశువైద్యశాల ప్రాంగణంలో కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు ఏడీ బి.దర్గారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టెట్ కమ్ టీఆర్టీ పెట్టాలి

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం 16,741 టీచర్స్ పోస్టులకు కొత్త నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించడం హర్షనీయమని, అయితే టెట్ కమ్ టీఆర్టీ పెట్టాలని రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ కె.సింహాద్రినాయుడు కోరారు. గత ఆరేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ లేదని, ఈ డీఎస్సీకి వయోపరిమిత పెంచి, పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

జాబితా సిద్ధం చేయండి

కంచిలి: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూసర్వేలో భూ యజమానులకు ఇచ్చిన ఎల్‌పీఎం నెంబర్లలో జాయింట్ ఎల్‌పీఎం నెంబర్ల జాబితా సిద్ధం చేసి ఉన్నతాధికారులను నివేదించాలని తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు, మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో భూ యజమానులకు సంబంధించిన భూ విస్తీర్ణంలో ఇద్దరు ముగ్గురు రైతులకు ఇచ్చిన జాయింట్ ఎల్‌పీఎంల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.